నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 29 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 28: ప్రధాన మంత్రి జన్ మన్ పథకంలో భాగంగా ఆసిఫాబాద్ మండలంలోని బనర్ గొంది, కుతోడ గ్రామాల్లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన బహుళార్థక భవన నిర్మాణాలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సోమవారం భూమి పూజ చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ భవనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జాబోరే రవీందర్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, గ్రామస్తులు, తదితరులున్నారు.

## కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

- పెదపల్లి జిల్లాకు బదిలీ అయిన దాసరి వేణు



జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 28: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేయగా ఇందులో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్‌ను పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



గుస్సాడీ నృత్యాలు చేస్తున్న ఆదివాసులు



గోదావరి వద్ద ఆదివాసుల పూజలు

# భక్తజన సంద్రం.. గోదావరి తీరం

### దండారీ దర్బార్‌కు వేలాదిగా తరలివచ్చిన ఆదివాసులు

- పద్మల్‌పురి కాకో అమ్మవారికి మొక్కులు
- ఆకట్టుకున్న గుస్సాడీ నృత్యాలు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీపీ భాస్కర్, జీసీసీ చైర్మన్

దండేపల్లి, అక్టోబర్28: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గుడిరేవు వద్ద పద్మల్‌పురి కాకో(ఏత్మాసార్) ఆలయానికి వచ్చిన ఆదివాసులతో గోదావరి తీరం భక్తజన సంద్రంగా మారింది. సోమవారం ఆలయ ఆవరణలో గుస్సాడీ దర్బార్‌లో వేలాది భక్తులు పాల్గొన్నారు. ముందుగా ఆలయం సమీపంలో గోదావరిలో స్నానాలు చేసి నది ఒడ్డున పూజలు చేశారు. నదీ జలాలతో వచ్చి కాకో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కానుగ నూనెలో తయారుచేసిన గారెలను నైవేద్యంగా సమర్పించారు. కోళ్లు, మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించారు. కొత్తగా పెళ్లయిన జంటలకు అమ్మవారి ముందు భేటీ కార్యక్రమం నిర్వహించారు. కొత్త కోడళ్లను అమ్మవారికి పరిచయం చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో వంటలు చేసుకొని భోజనాలు చేశారు. చుట్టు పక్కల జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ నుంచి గోండ్, ప్రధాన్, కోలాం, తోటి, తదితర ఆదివాసీ గిరిజనులు వేలాదిగా తరలి వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించారు.



దర్బార్‌కు హాజరైన గిరిజనులు

### ప్రత్యేక ఆకర్షణగా గుస్సాడీ నృత్యాలు..


ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిషా రాష్టాల నుంచి వచ్చిన గుస్సాడీ కళాకారులు వేషధారణలు, రేలా రేలా పాటలపై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆదివాసీ మహిళలు కోలాట ప్రదర్శనలో పాల్గొని సంప్రదాయ నృత్యాలు చేశారు.

### ఆదివాసీలు సంస్కృతీ సంప్రదాయాలు కాపాడుకోవాలి

ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జీసీసీ (తెలంగాణ రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్) చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. పద్మల్‌పురి కాకో ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం గుస్సాడీ దర్బార్‌లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాలన్నారు. పురాతన చరిత్ర కలిగిన పద్మల్‌పురి ఆలయ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాకో అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు చేశారు. ఆదివాసీ యువకులు ఉన్నత చదువులపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేందర్, ఎస్ఐ ఉదయ్ కిరణ్, ఆలయ కమిటీ చైర్మన్ కుడిమెత సోము, మాజీ సర్పంచ్ చిట్ల మంజుభార్గవి, రాయి సెంటర్ జిల్లా సభ్యుడు పెందురు రాంపటేల్, తుడం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు పుర్క బాపురావు, పర్ధాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు అడాయి కాంతారావు, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు కన్నాక జంగు, ఆదివాసీ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు ఉన్నారు.

### ప్రతి దండారీకి రూ. 15 వేల కేటాయింపు

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 28 : సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి దండారీకి రూ. 15 వేల చొప్పున కేటాయించినట్లు ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ (సీతక్క) సహకారంతో ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలోని వెయ్యి గ్రామాల్లోని ప్రతి దండారీకి రూ.15 వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు.



గుస్సాడీ వేషధారణలో గిరిజనుడు

పూజలు చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

గుస్సాడీ టోపీతో డీసీపీ భాస్కర్

ఆలయం వద్ద నృత్యం చేస్తున్న మహిళలు

# ప్రజల దృష్టి మళ్లించేందుకే కుట్ర

- బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్
- కేటీఆర్ ఇంట్లో పోలీసుల తనిఖీలపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



బెల్లంపల్లి : కాంటా చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్, నాయకులు



చెన్నూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ

బెల్లంపల్లి, అక్టోబర్ 28 : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు కాంగ్రెస్ సర్కారు తెరలేపిందని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై తనిఖీల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో దౌర్జన్యంగా దాడి చేయించిందని బెల్లపల్లిలోని పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బీఆర్ఎస్‌వీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్ సోదా చేసిన పోలీసులు, కేటీఆర్ ఇంటిపై దౌర్జన్యంగా దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కారణం, వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారని మండిపడ్డారు. ప్రతి పక్ష పార్టీ నేత ఇంటిపై పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించడమేమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులపై చాలా ఆరోపణలున్నాయని, వారి ఇళ్లపై దాడులు చేసే దుమ్ముందా అని హెచ్చరించారు. మంత్రి పొంగులేటి ఇంట్లో విదేశీ వాచీల వ్యవహారం ఏమైందని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలే కేటీఆర్‌ను కాపాడుకుంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు రోషణ్, అరుణ్, ప్రసాద్, కిరణ్, సంతోష్, రాజు కుమార్ పాల్గొన్నారు.

### సీఎం డైరెక్షన్‌లోనే కేటీఆర్ ఇంటిపై పోలీసు దాడులు

చెన్నూర్, అక్టోబర్ 28: సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇంటిపై పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేశారని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ ఆరోపించారు. చెన్నూర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కేటీఆర్ బావమరిది నూతన గృహ ప్రవేశం చేసినందుకు దసరా, దీపావళి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులకు విందు ఏర్పాటు చేస్తే, సీఎం డైరెక్షన్‌లో పోలీసులు, ఎక్సైజ్‌శాఖ వారు అక్కడ రేవ్ పార్టీ అని, అక్కడ డ్రగ్స్ అంటూ అక్కడ ఏమి లేకపోయిన, ఉన్నట్లు చిత్రీకరించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, ఎక్సైజ్‌వారి కుట్రలను అడ్డుకునేందుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు మరికొంత మంది ఎమ్మెల్యేలను, బీఆర్ఎస్ నాయకులను పోలీసు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆయన ఆరోపించారు. రుణ మాఫీ, రైతు బీమా, రైతు భరోసా, మహిళలకు నెలకు రూ 2,500, ఆసరా పింఛన్లను రూ 4,000పెంపు, కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని హామీలిచ్చారని ప్రజల్లో వ్యతిరేకతను, వారి దృష్టిని మళ్లించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ కుట్రలకు, అక్రమ అరెస్టులకు భయపడకుండా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జడల మల్లేశ్, నెన్నెల భీమయ్య, ఎనగందుల ప్రశాంత్, కొప్పుల రవీందర్, నయాబ్, జడల వెంకన్న, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న సర్కారు

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



*బెల్లంపల్లి, అక్టోబర్ 28 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై బురదజల్లడం, ప్రజల దృష్టిని మళ్లించడంలో భాగంగానే ఆయన బావమరిదిపై డ్రగ్స్ కేసు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రచేస్తున్నదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన నమస్తే తెలంగాణతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కక్ష్య సాధింపు చర్యలకు ఇది పరాకాష్ట అని మండిపడ్డారు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీలు జరిగాయంటూ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల ముందు నుంచే రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం శని, ఆదివారాల్లో బాంబులు పేలుతాయని పేర్కొనడం, చెప్పినట్లుగానే కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల, కేటీఆర్ ఇళ్ల పై దాడులు చేయడం ముందస్తుగా వేసిన స్కెచ్ అని ఆరోపించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, భార్యాభర్తలు ఉన్న ఫ్యామిలీ ఫంక్షన్‌ను రేవ్ పార్టీగా, డ్రగ్స్ పార్టీగా చిత్రీకరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా నేరుగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యులను అడ్డం పెట్టుకుని చీప్ పాలిటిక్స్ చేయడం మానుకోవాలని హితవు పలికారు.*

## రా రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుంత నాగరాజు
- జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక





మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుంత నాగరాజు

మంచిర్యాల, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లాలో రా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారులు సానుకూల దృక్పథంలో పరిష్కరించాలని రా రైస్ మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుంత నాగరాజు కోరారు. మిల్లుల కెపాసిటీకి మించి బియ్యం ఇచ్చిన సర్కార్, ఇప్పుడు సీఎంఆర్ పెండింగ్ పెట్టలేదని కేసులు పెట్టడం సరికాదన్నారు. సీఎంఆర్ పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కాకపోతే కొద్దిగా సమయం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. తమ కష్టాలను పరిగణలోకి తీసుకోకుండా, విజ్ఞప్తులను పట్టించుకోకుండా కేసులు పెడుతూ పోతే తమ కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. 100 కిలోల వడ్లు ఇస్తే 67 కిలోలు మిల్లర్ తిరిగి ఇవ్వాల్సి ఉందని కానీ 67 కిలోలు రావడం లేదని తెలిపారు. ఈ విషయంపై బహిరంగ పరీక్షలకు సైతం తాము సిద్ధంగా ఉన్నామన్నారు. తమకు ఇచ్చే వడ్లలో తేమ శాతం 17 ఉండాలి కానీ అంతకు మించి ఉంటుందన్నారు.ఇవన్నీ అధికారులకు తెలిసి కూడా తమ మెడపై కత్తి పెట్టడం ఎంత వరకు న్యాయమో ఆలోచించాలన్నారు. ఇన్ని రోజులు జిల్లాలో రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ కలిసి ఉండేదని, కానీ ఇప్పుడు రా రైస్ మిల్లర్లకు సంబంధించి ప్రత్యేక అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలో ఈ అసోసియేషన్ ఉందని, మంచిర్యాలలో ఈ రోజు ఏర్పాటైందని తెలిపారు. రా రైస్ మిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాడి గణపతిరెడ్డి ఆదేశాల మేరకు.. మంచిర్యాల నూతన కార్యవర్గం ఈ రోజు ఎన్నికైందన్నారు. అధ్యక్షుడిగా తనతో పాటు జనరల్ సెక్రటరీగా బత్తుల శ్రీనివాస్, ట్రెజరరిగా మావాడి సంతోష్, ఉపాధ్యక్షుడిగా జాడి రమేశ్, జాయింట్ సెక్రటరీగా కాళేశ్వరం సాగర్ తదితరులు ఎన్నికయ్యారన్నారు. సమస్యల పరిష్కారానికి రా రైస్ మిల్లర్లు అంతా ఏకతాటిపై ముందుకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజావాణిలో అర్జీల పరిష్కారంపై ప్రత్యేక చర్యలు

నస్పూర్, అక్టోబర్ 28 : ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, డీఆర్డీవో కిషన్‌తో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మందమర్రి, బెల్లంపల్లి, జైపూర్, పెర్కపల్లి, హాజీపూర్, దండేపల్లి, మందమర్రి, కన్నెపల్లి మండలాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తులు అందించారు.

### ఎన్నికలపై అధికారులకే అవగాహన లేకపోతే ఎలా?

కలెక్టరేట్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుండగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. అదనపు కలెక్టర్ మోతీలాల్ ఎంత మంది గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో నమోదు చేసుకున్నారని అడిగారు. అక్కడున్న అధికారులు కేవలం ముగ్గురు మాత్రమే నమోదు చేసుకున్నామని తెలిపారు. అసలు ఎమ్మెల్సీ అనే వారు ఏ సభలో ఉంటారు, దాన్ని ఏమని పిలుస్తారని అదనపు కలెక్టర్ అడుగగా కొద్దిమంది అధికారులు మాత్రమే స్పందించారు. అన్ని డిపార్ట్‌మెంట్లలోని గ్రాడ్యుయేట్ ఉద్యోగులందరితో ఓటరు నమోదు చేయించాలని సూచించారు. అధికారులే నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని మండిపడ్డారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

## ఐకే ఓసీని సందర్శించిన సింగరేణి సీఎండీ

జైపూర్, అక్టోబర్ 28: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఇందారం ఓపెన్‌కాస్టు గనిని ఆదివారం రాత్రి సింగరేణి సీఎండీ బలరాంనాయక్ సందర్శించారు. డైరెక్టర్ పీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏరియా జీఎం సంజీవరెడ్డి, మార్కెటింగ్ జీఎం రవిప్రసాద్‌తో కలిసి గనిలో పని స్థలాలను పరిశీలించారు. గనిపై లైటింగ్, పని స్థలాల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలను పరిశీలించారు. అధికారులు, ఓబీ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఓబీ ఎంత తీస్తే అంత బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, గని మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందారం ఓపెన్‌కాస్టుగనిపై అధికారులతో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం నాయక్



## 60 ట్రిప్పుల ఇసుక డంప్ సీజ్

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 28: మంచిర్యాల పట్టణంలోని కాలేజ్‌రోడ్, పద్మనాయక ఫంక్షన్ హాలు, డిగ్రీ కాలేజీ ఏరియాలో అక్రమంగా నిలువ చేసిన 60 ట్రిప్పుల ఇసుక డంప్‌ను సోమవారం రెవెన్యూ, మైనింగ్ శాఖల సిబ్బంది సీజ్ చేశారు. మంచిర్యాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అజీజ్ ఆధ్వర్యంలో సోమవారం కాలేజ్‌రోడ్‌లో ఇసుక అక్రమ నిల్వలు ఉన్నాయని ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేశారు. సమీపంలోని గోదావరి నది నుంచి అనుమతి లేకుండా ఇసుకను కొందరు వ్యాపారులు తీసుకువచ్చి అక్రమంగా నిలువ చేసినట్లు తెలిసింది. దాదాపుగా 60 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు ఆర్ఐ అజీజ్ తెలిపారు.

సీజ్‌చేసిన ఇసుకతో రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు



